సాక్షి
నల్లగొండ
గురువారం । 29 । జూన్ । 2023



అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

స్పెషల్ పోలీస్ బెటాలియన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని బెటాలియన్స్ డీజీపీ స్వాతిలక్రా అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

త్యాగానికి నిర్వచనం బక్రీద్

• మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: త్యాగానికి నిర్వచనం బక్రీద్ పర్వదినం అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో బక్రీద్ పండుగ పెంపొందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ముస్లింలంతా బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. సకల మత విశ్వాసాలను, సాంప్రదాయాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సమైక్యంగా జీవించేలా గంగా, జమునా, తహజీబ్‌ను కాపాడుకుంటూ రాష్ట్రంలో ఆధ్యాత్మిక పరంపర కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. తెలిపారు.

మెడికల్ కళాశాలకు రూ.50 కోట్లు మంజూరు

నల్లగొండ: నల్లగొండ మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మోసపూరిత కాల్స్‌ను నమ్మొద్దు: ట్రాన్స్‌కో ఎస్‌ఈ

నల్లగొండ: విద్యుత్ బిల్లు చెల్లింపు పెండింగ్‌లో ఉందని, వెంటనే బిల్లు చెల్లించకుంటే రాత్రి పూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తూ వినియోగదారులకు సందేశాలు పంపుతున్నారని అలాంటి కాల్స్, మెసేజ్‌లను నమ్మొద్దని ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలను సేకరించి, వినియోగదారుల ఖాతాల నుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తున్నారని, అలాంటి వివరాలు మా శాఖ ఎప్పుడు కూడా అడగదని, సేకరించదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు కోసం మా శాఖ తరఫున ఎలాంటి వెబ్‌సైట్ లింక్‌లు, మెసేజ్ పంపదని పేర్కొన్నారు. ఎలాంటి పరిచయం లేని గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫేక్ కాల్స్, పంపే మెసేజ్‌లపై ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

నల్లగొండ.. నగరం!

మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారనున్న నీలగిరి



నల్లగొండ పట్టణ వ్యూ

నీలగిరి స్వరూపం ఇలా..

వార్డులు	48
ప్రస్తుతం జనాభా	2.60లక్షలు
మహిళలు	1.31 లక్షలు
పురుషులు	1.29లక్షలు
గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు	20
ఇతర కాలనీలు	125
కార్పొరేషన్ అయితే పెరిగే వార్డులు	60

• రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ
• కొన్ని గ్రామాలను విలీనం చేసే అవకాశం
• కార్పొరేషన్‌తో మారనున్న పట్టణ రూపురేఖలు

నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అతిపెద్ద పట్టణంగా ఉన్న నీలగిరి కార్పొరేషన్‌గా మారబోతుంది. పెద్ద మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్న నేపథ్యంలో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉండి అన్ని అర్హతలున్న నీలగిరి కూడా కార్పొరేషన్ అయ్యే అవకాశం ఉన్నట్లు యంత్రాంగం చర్చించుకుంటోంది.

అవకాశాలు మెండుగా..

మున్సిపాటీల్లో 3లక్షల లోపు జనాభా ఉంటే కార్పొరేషన్ చేసే అవకాశం ఉంది. అయితే నీలగిరి మున్సిపాలిటీలో ప్రస్తుతం 2.60లక్షల మంది జనాభా ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీంతో నీలగిరి కార్పొరేషన్‌గా మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల ముందే నీలగిరి చుట్టూ పక్కల ఉన్న 14 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ చివరి నిమిషంలో విలీనాన్ని అమలు చేయకుండా వార్డుల విభజన చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. కార్పొరేషన్ కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచే నిధులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ రెండు శాతం పెరిగే అవకాశం ఉంటుంది.

పట్టణీకరణలో ముందంజ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూసినట్లయితే పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న పట్టణాల్లో నీలగిరి ముందంజలో ఉంది. పదేళ్ల క్రితం నీలగిరి జనాభా 1.65 లక్షల జనాభా ఉంటే ఇప్పుడు 2.60 లక్షలకు చేరుకుంది. పట్టణంలో కాలనీలు, భవనాలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, కొత్త వెంచర్లు భారీగా పెరిగాయి. డీవీకే, మిర్యాలగూడ, హైదరాబాద్ రోడ్ల ప్రాంతాల్లో మూడు, నాలుగు అంతస్తుల భవనాలు భారీగా నిర్మించారు.వీటికితోడు ఐదేళ్ల నుంచి నీలగిరి పట్టణంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులను నెలకొల్పారు.

1956లో మున్సిపాలిటీగా..

స్వాతంత్ర్యానంతరం 1950లో నీలగిరి లోకల్ ఫండ్‌గా ఏర్పడింది. ఆ తరువాత 1956లో మున్సిపాలిటీగా అవతరించింది. దశాబ్ది కాలంగా పిల్లల చదవులు, ఉపాధి అవకాశాల కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్రానికి వచ్చి స్థిర పడుతున్నారు. పట్టణాల జనాభాను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మున్సిపాలిటీలను గ్రేడ్‌ల వారీగా విభజించింది. ఆరేళ్ల క్రితం గ్రేడ్–1 మున్సిపాలిటీ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అవతరించింది.

విలీనం కానున్న గ్రామాలు..

కార్పొరేషన్‌గా మార్చాలనుకుంటే నీలగిరి మున్సిపాలిటీ శివారు హద్దు నుంచి 5 కిలోమీటర్ల లోపు దూరం ఉన్న గ్రామ పంచాయతీలు, వాటి ఆవాస గ్రామాలను విలీనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ సరిహద్దు నుంచి కంచనపల్లి, దీపకుంట, కొత్తపల్లి, గుండ్లపల్లి, గుట్టకింది అన్నారం, మేళ్లదుప్పలపల్లి, కన్నెబోయినతండా, ఖాజీరామారం, దండెంపల్లి, అనిశెట్టి దుప్పలపల్లి, అన్నెపర్తి, చందనపల్లి, బుద్ధారం తదితర గ్రామ పంచాయతీలు, వాటి ఆవాస గ్రామాలు కూడా విలీనం చేసే అవకాశం ఉంది.

రెండు స్టేషన్లలో ఎనిమిది రైళ్లకు హాల్ట్

• ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తికి స్పందించిన రైల్వే బోర్డు

నల్లగొండ, మిర్యాలగూడ: నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు నల్లగొండ, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లలో ఎనిమిది రైళ్ల హాల్ట్ ఇచ్చేందుకు రైల్వేబోర్డు అంగీకరించింది. పలు రైళ్లను నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లలో ఆపాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్‌కుమార్ సిన్హా ఆ రైళ్లను ఆయా స్టేషన్లలో ఆపాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చెన్నై–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి– నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్– సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ మిర్యాలగూడలో ఆపనున్నారు. అలాగే నల్లగొండలో రైల్వేస్టేషన్‌లో నర్సాపూర్–లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, చెన్నై–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–సికింద్రాబాద్, నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లను ఆపుతారు. దీంతో మిర్యాలగూడ, నల్లగొండ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన భట్టి పాదయాత్ర

• ఉమ్మడి జిల్లాలో 20 రోజులు.. 221 కిలోమీటర్లు సాగిన పీపుల్స్‌మార్చ్ యాత్ర
• మోతె మండలం నుంచి ఖమ్మం జిల్లాలోకి.



మోతె మండలం మామిళ్లగూడెంలో పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి, పద్మావతి, చెవిటి వెంకన్న

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సీఎల్పీ నేత భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం ముగిసింది. ఈ నెల 8న చందంపేట మండలం నక్కలగండి ప్రాజెక్టు వద్ద ప్రవేశించిన యాత్ర.. బుధవారం మోతె మండలం మామిళ్లగూడెం నుంచి ఖమ్మం జిల్లాలోకి వెళ్లింది. 20 రోజుల పాటు ఆరు నియోజకవర్గాల్లో 221 కిలోమీటర్ల మేర పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సాగింది. భట్టివిక్రమార్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూనే.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందంటూ విమర్శలు చేశారు. భట్టి పాదయాత్ర నల్లగొండ జిల్లాలోనే వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దేవరకొండలో బహిరంగ సభ నిర్వహించారు. 11వ తేదీన గుమ్మడవెల్లి గ్రామం వద్ద పైలాన్ ఆవిష్కరించారు. నకిరేకల్ నియోజకవర్గం ఉప్పలపాడు గ్రామం వద్ద భట్టి పాదయాత్రకు వంద రోజులు పూర్తయ్యాయి. అక్కడ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రతో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. పాదయాత్ర సాగిన గ్రామాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన రూపని ప్రదీప్ అదృశ్యమయ్యాడు. మండల పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమలో పని చేసే ప్రదీప్ ఈనెల 20న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి మల్లేశం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

రైలులో నుంచి జారిపడి యువకుడు మృతి

బీబీనగర్: రైలులో నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. బీబీనగర్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న సుమారు 25సంవత్సరాల యువకుడు బీబీనగర్ మండల కేంద్రలోని పూసల గోడౌన్ సమీపంలో మైలురాయి 227బై33, 34 దిగువ లైన్‌లో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి మృతిచెందాడు. మృతుడి వద్ద గల ఫోన్ రైల్లో నుంచి జారిపోవడంతో దానిని అందుకునే క్రమంలో దుర్ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

మేకల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేష్

సంస్థాన్ నారాయణపురం: ఇద్దరు మేకల దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. సంస్థాన్ నారాయణపురం చిల్లాపురం గ్రామానికి చెందిన పగిళ్ల నరేష్, మేకల రామకృష్ణ ఆటోలో బుధవారం సాయంత్రం అనుమానాస్పదంగా వెళ్తుండగా కానిస్టేబుల్ సింగం, చంద్రశేఖర్ పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి దగ్గర నుంచి రూ.లక్ష నగదు, 3మేకలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్, ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

కోతుల దాడిలో గాయపడిన వృద్ధురాలు మృతి



ఊశమ్మ(ఫైల్)

రామన్నపేట : రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో కోతుల దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఇంటిమేడ పైనుంచి జారిపడడంతో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మునిపంపుల గ్రామానికి చెందిన బూడిద ఊశమ్మ(82) ఈ నెల 19న ఉదయం ఇంటి మేడ మీదకు వెళ్లింది. ఆ సమయంలో మేడమీద ఉన్న కోతులు ఆమెపై దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మెట్లమీద నుండి జారి కిందపడింది. తలతోపాటు శరీరం లోపల బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఊశమ్మను కుటుంబ సభ్యులు రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 26న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది.

పసివాళ్లే సమిధలు..!



అనిరుధ్, హర్షవర్ధన్ మృతదేహాలు (ఫైల్)



ఉమారాణి, హర్షిణి, లాస్యల మృతదేహాలు(ఫైల్)

- కుటుంబ కలహాలకు తల్లిదండ్రులతో పాటు బలైపోతున్న చిన్నారులు
- ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్న కుటుంబ పెద్దలు
- క్షణికావేశంలో పేగుబంధాన్ని తుంచేందుకూ వెనుకాడని వైనం
- సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుక్కోకుండానే నిర్ణయాలు

చౌటుప్పల్ : కుటుంబ కలహాలకు తల్లిదండ్రులతో పాటు అభం శుభం తెలియని పసివాళ్లు సమిధలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు, రుణదాతల ఒత్తిడులను తట్టుకోలేకపోతున్న కుటుంబ పెద్దల అనాలోచిత నిర్ణయాలకు వారు కూడా బలైపోతున్నారు. కన్నవారి చేతులే యమపాశాలై ఇప్పుడిప్పుడే ఆశలగూడు అల్లుకుంటున్న పసిహృదయాలను చిదిమేస్తుంటే మౌనంగా తనువుచాలిస్తున్నాయి. మరికొన్ని ఘటనల్లో తల్లినో లేదంటే తండ్రినో కోల్పోయి అయినవారు లేక అనాథలుగా మిగిలిపోతున్నారు. ఫలితంగా ఆ కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. అందుకు ఉదాహరణే చౌటుప్పల్‌లో మంగళవారం జరిగిన రాజేశ్వరి కుటుంబ ఉదంతం.

ప్రాణాలు తీస్తున్న అప్పులు.. కలహాలు..

ఆత్మహత్యలు, హత్యలకు ప్రధానంగా అప్పులు ఓ కారణమైతే, కుటుంబ కలహాలు మరో కారణమవుతున్నాయి. మద్యపానం ఎన్నో కుటుంబాల్లో చిచ్చురేపిన ఉదంతాలు కోకొల్లలు. ఇబ్బందులు, కష్టాలు, బాధలు చూసేందుకు చిన్నవిలాగానే కనిపించేవే అయినప్పటికీ కొంత మంది తీవ్రమైన ఒత్తిడికి గురై దారుణాలకు ఒడిగడుతున్నారు. పరిష్కార మార్గాలు ఆలోచించకుండానే క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆ సమయంలో తామేమి చేస్తున్నామన్న విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారు. ఆ సమయంలో చంపడమో లేదంటే చావడమో చేస్తున్నారు. ఆయా ఘటనల్లో తల్లిదండ్రులకు పిల్లలు, పిల్లలకు తల్లిదండ్రులు దూరమౌతున్నారు. చాలా ఘటనల్లో సున్నిత మనస్కులైన మహిళలే ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అంతకు ముందుగా వారంతా తమ బిడ్డల ఊపిరితీసుకున్నారు. తమ చావు తర్వాత పిల్లల ఆలనాపాలనా చూసేందుకు ఎవరూ ఉండరన్న భావనతోనే ఆ తల్లులు బిడ్డల ఊపిరితీస్తున్నారు.

తాజా ఘటనలో..

తెలిసీతెలియక ఆన్‌లైన్‌లో జూదం ఆడిన రాజేశ్వరి చివరికి తన ప్రాణాల మీదికి తెచ్చుకుంది. ఆటలో తన డబ్బుతోపాటు ఇతరుల వద్ద అప్పుగా తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టి నిండా మునిగింది. చివరకు డబ్బు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఎదురైన తీవ్రమైన ఒత్తిడితో మానసికంగా ఇబ్బందికి గురైంది. అవమానభారం తట్టుకోలేక ఇప్పుడిప్పుడే లోకం చూస్తున్న ఇద్దరు కుమారులు అనిరుధ్, హర్షవర్ధన్‌ల ప్రాణాలు తీసి తానూ అఘాయిత్యానికి ఒడిగట్టింది. ఇలాంటి ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోవాల్సి ఉన్నా చాలా మంది ఆ పని చేయడంలేదు. చావే పరిష్కారం అనుకుంటున్నారు. ఫలితంగా అభం శుభం తెలియని చిన్నారులు బలైపోతున్నారు. ఏదేమైనా ప్రతి ఒక్కరూ చావే పరిష్కారం కాదన్న విషయాన్ని గుర్తించి బతికుండి సమస్యలను పరిష్కరించుకోవాలని పలువురు కోరుతున్నారు.

చౌటుప్పల్‌లో రెండేళ్ల క్రితం..

కుటుంబ కలహాల నేపథ్యంలో సరిగ్గా రెండేళ్ల క్రితం చౌటుప్పల్‌లోని రాంనగర్‌కాలనీలో తొర్పునూరి ఉమారాణి తన ఇద్దరు కుమార్తెలు హర్షిణి, లాస్యలను చంపి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. అదే ఘటనలో తన చిన్న కుమార్తె శైనీని సైతం చంపేందుకు ఉరి బిగించినప్పటికీ త్రుటిలో తప్పించుకుంది. క్షణికావేశంలో తీసుకున్న ఆ నిర్ణయంతో ఆ కుటుంబం ఛిన్నాభిన్నం అయ్యింది. ప్రాణాలతో బయటపడిన చిన్నారికి తండ్రి ఉన్నప్పటికీ తల్లి ప్రేమకు మాత్రం దూరమయ్యింది. ప్రస్తుతం బంధువుల సంరక్షణలో పెరుగుతోంది.

భార్యతోపాటు బిడ్డలను హత్య చేసి..

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో 12ఏళ్ల క్రితం సైతం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఇంట్లో ఏమైనా గొడవలు జరిగాయో లేక ఏదైనా ఆరోగ్య పరమైన కారణమో తెలియదుగానీ పెరుమాండ్ల లింగస్వామి అత్యంత దారుణానికి ఒడిగట్టాడు. అప్పట్లో ఈ సంఘటన స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. భార్యతో పాటు ఇద్దరు కుమారులను హత్య చేశాడు. ఆ తర్వాత తాను సైతం ఆత్మహత్య చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. చికిత్స పొందిన తర్వాత కోలుకున్నాడు. ఆర్థికంగా చాలా ఉన్నతమైన స్థితిలో ఉండి సమాజంలో చక్కటి గుర్తింపు పొందిన ఆ వ్యక్తి భార్యా, బిడ్డలను ఎందుకు హత్య చేయాల్సి వచ్చింది? కనీస ఆలోచన ఎందుకు చేయలేదో ఇప్పటికీ అంతుచిక్కడంలేదు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



జావెద్(ఫైల్)

కేతేపల్లి : అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని బండపాలెం శివారులో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన ఎండీ.జానీపాషా కుటుంబంతో సహా నకిరేకల్ తరలి వచ్చి అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈయన కుమారుడు ఎండీ.జావెద్(21) ఇంటర్మీడియట్ వరకు చదివి నకిరేకల్‌లోని ఓ బంగారు నగల దుకాణంలో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన జావెద్ రాత్రి పొద్దుపోయే వరకు తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు జావెద్ సెల్‌కు ఫోన్ చేయటంతో రాత్రి 11 గంటల వరకు రింగ్ అయి తర్వాత స్విచ్ఛాఫ్ అయ్యింది. జావెద్ అదృశ్యమైన విషయాన్ని కుటుంబ సభ్యులు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. కేతేపల్లి మండలంలోని శివారులో ఉన్న గ్రానైట్ క్వారీ గుంతలో ఉన్న నీటిలో జావెద్ మృతదేహం తేలుతూ ఉండటాన్ని బుధవారం సాయంత్రం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జావెద్ చొక్కా, సెల్‌ఫోన్ క్వారీ గుంత ఒడ్డున ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి జానీపాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఎస్ఐ కొట్టాడంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

కేతేపల్లి: విచారణ పేరుతో ఓ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చి చితకబాదారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి కేతేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కేతేపల్లి మండలం భీమారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇటీవల రెండో వివాహం చేసుకున్నాడు. తన భర్త తరుచూ వేధిస్తున్నాడని, కుటుంబ సభ్యులతో కలిసి తనపై హత్యాయత్నం చేశాడంటూ భర్తతో పాటు ఆయన బాబాయి కుమారుడు కోట శ్రీనివాస్‌పై మొదటి భార్య కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వారం రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో విచారణ పేరుతో కోట శ్రీనివాస్‌ను బుధవారం స్టేషన్‌కు పిలిచి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ చితకబాదారని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కేసులో శ్రీనును అన్యాయంగా ఇరికించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీనుకు నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈవిషయమై ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌ను వివరణ కోరగా బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుక వచ్చి చితకబాదామని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మహిళ చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపించి ఆమె భర్తతో పాటు కోట శ్రీనివాస్‌పై సెక్షన్ 307 కింద కేసు నమోదు చేశామని తెలిపారు. తాను స్టేషన్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకే బయటికి వెళ్లానని, రిమాండ్ చేస్తామనే భయంతోనే నాటకానికి తెర లేపారని ఎస్ఐ పేర్కొన్నారు.

గంజాయి మత్తులో చోరీకి యత్నం

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు



గోపిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

ఖమ్మంక్రైం: ఖమ్మం 51వ డివిజన్‌లో పది రోజులుగా స్థానికులను భయభ్రాంతులు గురిచేస్తూ గంజాయి మత్తులో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని స్థానికులు బుధవారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన గోపి (నవీన్) ఎన్నెస్పీ క్యాంప్‌లో గంజాయి, మద్యం తాగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో దొంగతనాలకు కూడా పాల్పడుతుండగా స్థానికులు కమిటీగా ఏర్పడి బుధవారం ఆయనను బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వగా అదుపులోకి తీసుకున్నారు.

వేధింపుల కేసులో యువకుడి రిమాండ్

మోత్కూరు : ప్రేమ పేరుతో బాలికను వేధించిన కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించాలని అదే గ్రామానికి చెందిన స్వామి వేధిస్తున్నాడు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రామన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పథకాలను చేరవేయాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని స్లమ్ సమాఖ్యలు, పట్టణ సమాఖ్యలు, పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలకు చెరువయ్యే విధంగా చూడాలని నల్లగొండ జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ ఎరమాద కరుణాకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌పీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌పీలు ప్రతి రోజు తప్పకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ శివాజీనాయక్, మాస్టర్ ట్రైనర్ యాకుబ్, మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓలు శ్రీనివాస్‌చారి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ముగిసిన తల్లి, కుమారుల అంత్యక్రియలు



తల్లి, కుమారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, స్థానిక మహిళలు



అంతిమయాత్రలో పాల్గొన్న జనం, బంధువులు

- మృతుల ఇంటి వద్ద మిన్నంటిన రోదనలు
- దహనసంస్కారాలకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మంగళవారం రాత్రి చనిపోయిన తల్లి, ఇద్దరు కుమారుల అంత్యక్రియలు బుధవారం జరిగాయి. మృతులు అవిశెట్టి రాజేశ్వరి, ఆమె ఇద్దరు కుమారులు అనిరుధ్, హర్షవర్ధన్‌ల మృతదేహాలకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మల్లికార్జుననగర్‌కాలనీలోని వారి సొంత ఇంటికి తీసుకెళ్లారు. మృతదేహాలను చూసేందుకుగాను స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళల రోదనలతో ఆ ప్రాంతం పూర్తిగా శోకసంద్రంగా మారింది. కుటుంబసభ్యులు, బంధువులు ముగ్గురి మృతదేహాలకు సాంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించారు. అవిశెట్టి నర్సింహ తన కోడలితోపాటు ఇద్దరి మనువళ్లకు అంతిమ సంస్కారాలు నిర్వహించాడు. తప్పని పరిస్థితుల్లో రాజేశ్వరి చనిపోయినా ఇద్దరు పిల్లలనైనా వదిలేసి ఉంటే బాగుండని చర్చించుకున్నారు. అప్పు చెల్లిస్తామని బతిమిలాడినా కనీసం విన్పించుకోకుండా మానసికంగా వేధించిన వ్యక్తులకు పలువురు శాపనార్థాలు పెట్టారు.

ముగ్గురిపై కేసు నమోదు

ముగ్గురు మృతిచెందిన ఘటనపై పోలీసులు ముగ్గురు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేశారు. అప్పు చెల్లించే విషయంలో ఇంటికి వెళ్లి తీవ్రంగా వేధించడంతోపాటు ముగ్గురి చావుకు కారణమని రాజేశ్వరి తల్లి రాములమ్మ ఫిర్యాదు ఇచ్చింది. ఆ మేరకు రాజేశ్వరి భర్త మల్లేష్‌కు సొంత తమ్ముడైన శ్రీశైలంతోపాటు మరో ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

స్పెషల్ పోలీస్ బెటాలియన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



అన్నెపర్తి బెటాలియన్‌లో మొక్కకు నీరు పోస్తున్న అదనపు డీజీపీ స్వాతి లక్రా చిత్రంలో ఎస్పీ, కమాండెంట్

- పోలీస్ సిబ్బంది కష్టపడి పనిచేసి బెటాలియన్‌కు పేరుతీసుకురావాలి
- అన్నెపర్తి బెటాలియన్ నిర్వహణ భేష్
- అదనపు డీజీపీ స్వాతి లక్రా



అన్నెపర్తి బెటాలియన్‌లో చిల్డ్రన్ పార్కును ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ స్వాతి లక్రా

నల్లగొండ క్రైం : రాష్ట్రంలోని అన్ని బెటాలియన్లలో సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని అదనపు డీజీపీ స్వాతి లక్రా అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణ పరిధిలోని అన్నెపర్తిలో ఉన్న 12వ బెటాలియన్‌ను ఆమె సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం బెటాలియన్‌లో ఫిష్ పోండ్, స్వాతి లక్రా చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. అడిషనల్ డీజీపీగా పూర్తిస్థాయిలో బాధ్యతలు తీసుకున్న తర్వాత నల్లగొండ బెటాలియన్ సందర్శించడం ఇదే ప్రథమం తెలిపారు. పోలీస్ సిబ్బంది కష్టపడి పని చేసి బెటాలియన్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో బెటాలియన్ నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. బెటాలియన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నర్సరీలు, పార్కులు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ బెటాలియన్‌లో 300 మంది ఎస్సీటీ పీసీలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకోసం గ్రౌండ్ సిద్ధం చేయడంతో పాటు క్లాస్ రూమ్స్, కిచెన్లను, గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చుకోవాలన్నారు. బెటాలియన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. బెటాలియన్‌లో ప్రభుత్వ పాఠశాల కూడా అద్భుతంగా ఉందని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు తరగతులు బోధించడం సంతోషకరమన్నారు. ఆమె వెంట నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, బెటాలియన్ కమాండెంట్ ఎన్వి సాంబయ్య, అడిషనల్ కమాండెంట్లు, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- తిరుమలగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతరాజు రజని



పోతరాజు రజనీరాజశేఖర్

తిరుమలగిరి (తుంగతుర్తి) : బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తిరుమలగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్ సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మున్సిపాల్టీ పరిధిలోని అనంతారం బిక్కేరు వాగులో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోందని, వాల్టా చట్టం అమలు చేయాలని గతంలో రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు. స్థానికంగా ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను కేటాయించక పోగా ప్రజలు బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. స్థానిక ప్రజలకు ఇసుక దక్కక పో గా ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల పేరిట కొన్ని వాహనాలకే పర్మిషన్లు ఇస్తున్నా వందల వాహనాలు అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక అక్రమంగా సాగకుండా పోలీస్, మైనింగ్, ఇరిగేషన్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో వేబిల్లుల ద్వారా ఇసుకకు అనుమతించాలన్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రవాణా చేసే సమయంలో నోటీసు బోర్డులో పెట్టి వాహనాల నంబర్లు, ప్రాజెక్టుల వివరాలు జత పరిచి పొందుపరచాలన్నారు. లేని పక్షంలో స్థానిక ప్రజలు కౌన్సిల్ సభ్యులతో కలిసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని హెచ్చరించారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో అనుమానితుడు?
- హత్యోదంతానికి ఆర్థిక లావాదేవీలే కారణమని భావిస్తున్న పోలీసులు

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ పులిజాల రఘురాములు(36) హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. హతుడి కాల్‌డేటాతో పాటు సీసీ ఫుటేజీ ఆధారంగా ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. రఘురాములు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం అయి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. హత్యకు గురైన రఘురాములు ముఖంపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని ఎక్కడ హత్య చేశారు? ఇందులో ఎంత మంది ప్రమేయం ఉందని లోతుగా విచారిస్తున్నారు. హత్యోదంతంలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలా ఉంటే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.3లక్షలు అప్పు తీసుకొని చెల్లించే క్రమంలో వచ్చిన భేదాభిప్రాయాలే హత్యకు దారితీయొచ్చని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

- తొలి ఏకాదశికి ముస్తాబు



తొలి ఏకాదశికి ముస్తాబైన మట్టపల్లి దేవాలయం (ఇన్‌సెట్)లో గర్భాలయంలోని మూలవిరాట్ శ్రీలక్ష్మీనారసింహస్వామి

రహదారులపై నెత్తుటి మరకలు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఇస్లావత్ దుర్గా(ఫైల్)

మిర్యాలగూడ టౌన్ : రహదారులు మరోమారు నెత్తురోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం కాలువపల్లి తండాకు చెందిన ఇస్లావత్ దుర్గానాయక్(27) దామరచర్ల మండలం నర్సాపురం వద్ద బంధువుల పొలం దున్ని తిరిగి ట్రాక్టర్ నాగండ్లతో స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో యాద్గార్‌పల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు బోల్తాకొట్టడంతో డ్రైవర్లు ఇస్లావత్ దుర్గానాయక్, బత్తిని సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో దుర్గానాయక్ మృతిచెందాడు. గాయపడిన బత్తిని సాయి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య, పాప ఉంది. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

టిప్పర్- లారీ ఢీకొని..

మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొందుగుల గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీను(35) బైక్‌పై ఇంటి నుంచి పెట్రోల్ కోసం దామరచర్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో చెక్‌పోస్టు వద్దకు రాగానే అదే సమయంలో టిప్పర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ శ్రీను బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్ శ్రీను తలపై వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి..



మోతీలాల్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని లప్సానాయక్ తండా గ్రామానికి చెందిన ధీరావత్ మోతీలాల్ (29) ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని రాళ్లజనగాం గ్రామం నుంచి లప్సానాయక్ తండా గ్రామానికి మంగళవారం రాత్రి మోతీలాల్ బైకుపై వెళ్తూ అదుపుతప్పి కల్వర్టును ఢీ కొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ధీరావత్ ప్రమీల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు సీఐ సైదయ్య తెలియజేశారు.

ఆటో బోల్తా పడడంతో..



భిక్షం మృతదేహం

మునగాల (కోదాడ): నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లి గ్రామానికి చెందిన అంబటి భిక్షం(30) తన అత్తగారి ఊరైన ఖమ్మం జిల్లా పాలేరు మండలం నాయకన్‌గూడెం గ్రామానికి వెళ్లేందుకు కోదాడలో ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో బరాఖతగూడెం గ్రామశివారులో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అంబటి భిక్షంకు గాయాలయ్యాయి. అతడిని కోదాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటో డ్రైవర్ షేక్ మస్తాన్‌కు కూడా ఈ ప్రమాదంలో తీవ్రగాయాయ్యాయి. మృతుడి తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.